క్లుప్తంగా

శుక్రవారం డ్రైడే పాటించండి



పోతవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న లక్ష్మణరావు

నల్లజర్ల: ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి పరిసరాల పరిశుభ్రత చేపట్టి దోమల ద్వారా వచ్చే మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ బోద కాలు, మెదడువాపు వ్యాధులను నివారించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు సూచించారు. గురువారం పోతవరం పీహెచ్‌సీ పరిధిలో పోతవరం, తెలికిచెర్ల గ్రామాలలో క్షేత్రస్థాయి పరిశీలన, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి లార్వాలను ధ్వంసం చేయాలన్నారు. దోమగుడ్లు పెట్టిన తర్వాత అవి పిల్లగా మారడానికి 10రోజులు పడుతుందని, లార్వాను నాశనం చేయడానికి నిల్వ ఉన్న నీటిని ఏడవరోజునే బయటకు పారబోయాలన్నారు. ప్రతి వారం ఇంటి పరిసరాలలో నిల్వ ఉన్న నీటిగుంటలను శుభ్రం చేయాలన్నారు. గ్రామ కార్యదర్శి ఉషారాణి, వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్త కనక దుర్గ, ఆశాలు సుమ, రాధ, లక్ష్మి పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: పురపాలక సంఘం సాధారణ సమావేశం శనివారం ఉదయం 12 గంటలకు నిర్వహించనున్నట్లు చైర్ పర్సన్ బావన రత్న కుమారి తెలిపారు. పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై సమీక్షించనున్నట్లు ఆమె తెలిపారు.

శోభన్‌బాబుకు ఘన నివాళి



కొవ్వూరులో శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న అభిమానులు

కొవ్వూరు: సినీ హీరో పద్మభూషణ్ శోభన్ బాబు 17వ వర్ధంతిని ఆయన అభిమానులు కొవ్వూరులో గురువారం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మజ్జిగ పంపిణీ చేశారు. అనపర్తి గోపాలకృష్ణ, కె.ప్రకాష్ పాల్గొన్నారు.

అస్పృశ్యత నిర్మూలనకు అంబేడ్కర్ కృషి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పట్టణ సీఐ విశ్వం

కొవ్వూరు: అస్పృశ్యత నిర్మూలన, సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని పట్టణ సీఐ పి.విశ్వం పేర్కొన్నారు. పట్టణంలో మెరకవీధిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన గురువారం పూలమాల వేసి నివాళి అర్పించారు. 98వ మహద్ చెరువు పోరాటాన్ని పురస్కరించుకుని స్థానిక నాలుగో వార్డులో అంబేడ్కర్ సేవలను గుర్తు చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యామ్ రవి ప్రకాష్ మాట్లాడుతూ 1927 మార్చి 20న బాబాసాహెబ్ అంబేడ్కర్ మహద్ చెరువులోని మంచినీళ్ల తాగేందుకు షెడ్యూలు కులాల వారితో త్యాగ పూరితమైన పోరాటం చేశారన్నారు.

పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని వినతి



గోపాలపురం తహసీల్దార్ అజయ్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న పెన్షనర్లు

గోపాలపురం: రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పీఆర్‌సీకి ప్రభుత్వం వెంటనే కమిషన్ వేయాలని, ఐఆర్ ప్రకటించాలని గోపాలపురం మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు గురువారం తహసీల్దార్ కె.అజయ్ బాబుకు సమస్యలతో వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని వారు కోరారు. వారికి రావాల్సిన డీఆర్, పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈహెచ్‌ఎస్ కార్డుపై వైద్యం చేయలేమని డాక్టర్లు చెబుతున్నారని అందువల్ల ఈహెచ్‌ఎస్ కార్డుపై నగదు రహిత వైద్యం అందించాలన్నారు. వయోవృద్ధులైన పెన్షన్‌దారులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

సూక్ష్మ సేద్యం.. సిరుల భాగ్యం

- గత ఏడాది 478 హెక్టార్లలో డ్రిప్ సౌకర్యం
- ఈ ఏడాది 1,591 హెక్టార్లలో రిజిస్ట్రేషన్లు
- బోరున్న ప్రతి రైతూ అర్హుడే..
- రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్లు
- ఏప్రిల్ 1నుంచి కొత్త సబ్సిడీలు
- 90 శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం
- 50 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లు



వర్జీనియా పొగాకు సాగులో డ్రిప్ అమర్చిన రైతులు

నల్లజర్ల: మెట్ట ప్రాంతంలో రైతులు సూక్ష్మసేద్యం(డ్రిప్, స్ప్రింక్లర్లు)తో అధిక దిగుబడులు సాధిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. మండలంలో 4,122 బోర్లు ఉండగా వీటి కింద 8,226 హెక్టార్ల సాగు భూమి ఉంది. ఇంతవరకు 7,755 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేసే అవకాశం ఉంది. 2023-24 సంవత్సరంలో 478 హెక్టార్లకు డ్రిప్ సౌకర్యం కల్పించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,355మంది రైతులు కొత్తగా డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇంతవరకు 592 మంది రైతులకు పనిముట్లు అందజేశారు. అన్నిరకాల పండ్లు, పూలతోటలకు, మామిడి, ఆయిల్‌పామ్, బొప్పాయి, పుచ్చ, ఆకుకూరలు, వేరుశనగ తదితర పంటలకు స్ప్రింక్లర్లు చాలా ఉపయోగపడుతున్నాయి. బోరు, విద్యుత్ ఉన్న ప్రతి రైతు సూక్ష్మ సేద్యానికి అర్హుడే.

డ్రిప్ ఉపయోగాలు

బిందు సేద్యం పంటలకు 30నుంచి 70 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయవచ్చు. అన్ని మొక్కలకు సమంగా నీరు అందుతుంది. అధిక మొలక శాతం, సమానమైన పంట పెరుగుదల ఉంటుంది. నీటి ద్వారానే ఎరువుల సరఫరా చేయడం ద్వారా పంట పెరుగుదలకు అనుగుణంగా పోషకాలు సరఫరా అవుతాయి. కలుపు సమస్య బాగా తగ్గుతుంది. ఏకకాలంలో పంట కోతకు వస్తుంది. సూక్ష్మసేద్యం ద్వారా 40శాతం కరెంటు ఆదా అవుతుంది. కూలీల ఖర్చు 40శాతం తగ్గుతుంది. పంటలకు చీడపీడల సమస్య తక్కువగా ఉంటుంది. ఎత్తుపల్లాల నేలలో కూడా సులభంగా నీరు పారించవచ్చు. నాణ్యమైన ఉత్పత్తి రావడంతో పాటు ఎకరాకు 20,30 శాతం వరకు దిగుబడి పెరుగుతుంది.

ఏప్రిల్ 1నుంచి అమల్లోకి కొత్త సబ్సిడీలు



సూక్ష్మ సేద్యంలో మంచి ఫలితాలు వస్తున్నాయి. డ్రిప్ కింద కూరగాయలు, పండ్ల తోటలు, వివిధ పంటల సాగు చేశారు. దిగుబడులు గణనీయంగా పెరిగాయి. రైతులకు నికరాదాయం లభించింది. ఈ ఏడాది ఏప్రిల్ 1నుంచి కొత్త సబ్సిడీలు అమల్లోకి రానున్నాయి. 5ఎకరాల లోపు రైతులకు 90శాతం, 5పైన 10లోపు ఎకరాల రైతులకు 70 శాతం, 10 ఎకరాలు దాటిన రైతులకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులు జీఎస్టీ చెల్లిస్తే 100శాతం సబ్సిడీగా అందించనున్నారు. స్ప్రింక్లర్లకు రైతుకు 50 శాతం రాయితీ ఉంటుంది.

– యం.బబిత, ఉద్యానశాఖాధికారి, నల్లజర్ల

డయేరియా కేసులు పూర్తిగా అదుపులో..



పెద్దగూడెంలో మంచినీటి ట్యాంకు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పెద్దగూడెం గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

గోపాలపురం: మండలంలో ప్రబలిన డయేరియా కేసులు పూర్తిగా అదుపులోకి వచ్చినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం పెద్దగూడెంలో పర్యటించిన ఐడీఎస్‌పీ బృందానికి గ్రామస్తులు పారిశుధ్య నిర్వహణపై ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం కలెక్టర్ ప్రశాంతి ఆ ప్రాంతాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపాలని, మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. వాతావరణంలో వచ్చిన మార్పులు, వడగాడ్పుల వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డయేరియా పూర్తిగా అదుపులో ఉందని, ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వాంతులు, విరేచనాలు, జ్వరం వచ్చిన వెంటనే స్థానిక ఏఎన్‌ఎంను సంప్రదించాలని, వారి ద్వారా ఆసుపత్రిలో చికిత్స పొందాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట డాక్టర్ టి రాజీవ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టీజీ అజయ్‌బాబు, ఏఈ బంగారయ్య, కార్యదర్శి వి.అనురాధ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సూపర్ సిక్స్ హామీల పేరిట మోసం

ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన



హామీలను అమలు చేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్న ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు

కొవ్వూరు: తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్, ఇతర హామీలు అమలు చేస్తామని నమ్మించి కూటమి మోసగించిందని ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు ఈమని మల్లిక ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని తక్షణమే పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. 19 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సు ఉన్న మహిళలకు నెలకి రూ.15వేలు చొప్పున ఏడాదికి రూ.18వేలు ఇస్తామంటూ నమ్మించి కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తయినా ఏ ఒక్క మహిళకు ఒక్క రుపాయి కుడా ఇవ్వలేదన్నారు. మద్యం అమ్మకాలపై ఆధారపడి ప్రభుత్వం కొనసాగడం బాధాకరం అన్నారు. మద్యం మత్తులో మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, హత్యలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 80 మంది మహిళలు అత్యాచారానికి లోనయ్యారన్నారు. ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు ఎం.రత్న, ఎం.సాయికుమారి, భవాని, జి.పార్వతి, ఎం.బేబీరాణి, పి.సత్యవతి, హరిత పాల్గొన్నారు.

వడదెబ్బ .. తప్పేదెట్లా?

వైద్య శాఖ అవగాహన కార్యక్రమాలు

నల్లజర్ల: కాలం ఏదైనా దానికి తగ్గట్టుగా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటే ముందుకు సాగాలని లేదంటే ఆరోగ్యంపై తీవ్రప్రభావం పడి కొన్ని సార్లు ప్రాణాంతకంగా మారుతుందని పోతవరం పీహెచ్‌సీ డాక్టర్ ఎల్.రాజశేఖర్ వృద్ధులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం సుభద్రపాలెంలో వృద్ధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోజు రోజుకు తీవ్రమవుతున్న ఉష్ణోగ్రతలు అనేక సమస్యలు తెచ్చి పెడుతున్నాయన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందన్నారు.

లక్షణాలు..

శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటీగ్రేడ్ దాటితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందన్నారు. ఆ సమయంలో అలసట, శరీరం నుంచి వేడి ఎక్కువ బయటకు రావడం, డీహైడ్రేషన్‌కు గురవుతారన్నారు. వాంతులు, తలనొప్పి బలహీనపడటం, కండరాల తిమ్మిర్లు, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కన్పిస్తాయన్నారు. ఒక్కోసారి గుండె పోటు వచ్చే అవకాశం ఉందన్నారు.

జాగ్రత్తలు..

ఏ వయసు వారైనా మధ్యాహ్న సమయంలో కాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు పూర్తి చే సుకోవాలని డాక్టరు రాజశేఖర్ సూచిస్తున్నారు. ఎండలో ప్రయాణించేవారు తప్పనిసరిగా మంచినీళ్ల బాటిల్ వెంట తీసుకెళ్లాలన్నారు. వేసవిలో శరీర ఉష్ణోగ్రతలను పెంచే మద్యం, పొగతాగడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధిగ్రస్తులు వీలైనంత వరకు ఇంటిపట్టునే ఉండాలన్నారు. ఎండలో పనిచేసే వారు తలకు టోపీ లేదా కండువా కప్పుకోవాలన్నారు. ఆహారంలో ఉప్పు, నీరు, అధిక పోషకాలు ఉన్న వాటిని తీసుకోవాలన్నారు. ఏ మాత్రం అలసటగా ఉన్నా సమీప ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు దగ్గర ఉంచుకోవాలన్నారు. సూపర్‌వైజర్ సత్యం, యం.యల్.హెచ్.పి, ఆశలు పాల్గొన్నారు.

రైళ్ల హాల్టులపై హైకోర్టు తీర్పు హర్షణీయం

కొవ్వూరు రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి



కొవ్వూరులో రైల్వే స్టేషన్ ప్లకార్డులు చూపుతున్న రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు

కొవ్వూరు: రైల్వే స్టేషన్‌లో 2019 నాటి ఎక్స్‌ప్రెస్ హాల్టుల పునరుద్ధరణపై 60 రోజుల్లో స్పందించాలని రైల్వేశాఖను ఆదేశిస్తూ హైకోర్టు తీర్పు నివ్వడంపై కొవ్వూరు రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి హర్షం వ్యక్తం చేసింది. కరోనా విపత్తు అనంతరం కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో అనేక రైళ్ల హాల్టులను ఎత్తివేశారు. దీంతో పరిరక్షణ సమితి రైళ్ల హాల్టులపై ఐదేళ్ల నుంచి పోరాటం చేస్తోంది. దీనిలో భాగంగా దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వాజ్యంపై హైకోర్టు స్పందించడంపై సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2019 నాటి హాల్టులను పునరుద్ధరించాలని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఈ సందర్భంగా గురువారం రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి ప్రత్యేకంగా సమావేశమైంది. గడిచిన నాలుగైదేళ్ల నుంచి ఈ సమితి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. అనేక ఆందోళనలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతి పత్రాలు, పోస్టుకార్డుల ద్వారా సమస్యను తెలియజేశారు. 60 రోజుల్లో స్పందించాలని రైల్వే శాఖను హైకోర్టు ఆదేశించడం తాము చేస్తున్న ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. గారపాటి రామ్మోహన్‌రావు,వీటీ విల్సన్,వైకే శ్రీనివాస్,చిలంకుర్తి బాబి,పడాల సుబ్బారెడ్డి,పి.కుమార్,యాలం రమేష్,కృష్ణంరాజు పాల్గొన్నారు.

శారీరక ఇబ్బందులకు ఫిజియో థెరపీతో ఉపశమనం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫిజియో థెరపిస్టులు డాక్టర్ మహేష్, డాక్టర్ రమేష్

ఉండ్రాజవరం: పని ఒత్తిడి వలన అనేక శారీరక ఇబ్బందులకు గురయ్యే ప్రభుత్వ ఉద్యోగులు ఫిజియో థెరపీ ద్వారా ఉపశమనం పొందవచ్చునని హైదరాబాద్ నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన ఫిజియో థెరపిస్టులు డాక్టర్ మహేష్‌కుమార్, డాక్టర్ రమేష్ అన్నారు. ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు అధ్యక్షతన గురువారం ఫిజియో థెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తలనొప్పి, మైగ్రేన్, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, తదితర ఆరోగ్య సమస్యలకు నివారణ చిట్కాలు, సాధారణ వ్యాయామాల గురించి వివరించారు. ఈవోపీఆర్డీ కె.అంజనేయ శర్మ, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనం వద్దంటూ వినతి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చాగల్లు: స్థానిక జూనియర్ బేసిక్ స్కూల్లోని 3, 4, 5 తరగతులను నెలటూరు ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయవద్దని తల్లితండ్రులు కోరారు. విలీనాన్ని నిరసిస్తూ గురువారం ఎంఈవో యు.గురునాథంకి విద్యార్థుల తల్లిదండ్రులు, సీపీఎం నాయకులు, తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులతో ఎంఈవో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న పాఠశాలను ఈ విధంగా విలీనం చేయడం తగదని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఎంఈవో యు.గురునాథం మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనాల కోసమే ఈ విధంగా చేస్తున్నారన్నారు. తల్లిదండ్రుల అభిప్రాయంను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని ఆయన హామీ ఇచ్చారు. సీపీఎం నాయకులు కేకే దుర్గారావు, కుకటాల బుద్దుడు, జీవీ సుబ్బారావు, స్థానిక నాయకులు ఇంటి వీర్రాజు, మిరిమాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు 'సంకల్ప' మెగా జాబ్ మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత సంకల్ప మెగా జాబ్ మేళాకు హాజరై ఉద్యోగాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంకల్ప-జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ జాబ్ మేళాలో 25 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. వివిధ ఉద్యోగాలకు టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంకాం తదితర కోర్సులు పూర్తి చేసిన 19 నుంచి 50 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళీ మాట్లాడుతూ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ సంయుక్తాధ్వర్యంలో రాజమండ్రి నియోజకవర్గంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తారన్నారు. రిజిస్ట్రేషన్, ఇతర సమాచారం కోసం 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ఎ.అప్పలకొండ, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రతపై మీటర్ రీడర్ల ఆందోళన

రాజమహేంద్రవరం సిటీ: స్మార్ట్ మీటర్ల వల్ల తాము ఉపాధి కోల్పోతామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం రాజమండ్రి డివిజన్ (రాజమండ్రి టౌన్, రూరల్) శాఖ డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ ఆధ్వర్యంలో గోదావరి గట్టున ఉన్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఆఫీసు ఎదురుగా ఉన్న మహాత్మా జ్యోతీబా పూలే విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ, పాతికేళ్లగా పని చేస్తున్న తమకు ఇంతవరకూ ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లను నమ్మి, తమకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నో పోరాటాలు చేసి పీఎఫ్, ఈఎస్ఐ, బ్యాంకు ద్వారా జీతాలు అందే విధంగా సాధించుకున్నామని తెలిపారు. గత 15 ఏళ్లుగా పీఎఫ్, ఈఎస్ఐ పొందుతున్నా, తమకు ఇప్పటివరకూ ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే తమకు ఇక ఉపాధి ఉండదన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఇదే పని నమ్ముకుని ఉన్న తమకు, ఇప్పుడు 48 ఏళ్ల వయసులో వేరే ఉద్యోగాల్లో ఎవరు తీసుకునే పరిస్థితి లేదన్నారు. తమ సమస్యను సంస్థ సీఎండీ, ఎస్ఈ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని, లేకుంటే కుటుంబాలతో రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు పిల్లా ప్రసాద్, డివిజనల్ కోశాధికారి బొమ్మనబోయిన రామకృష్ణ, డివిజన్ కార్యదర్శులు కె.సురేష్‌కుమార్, దొంతంశెట్టి మూర్తి, రాజానగరం సెక్షన్ కార్యదర్శి కప్పల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆదరణ-3 సమావేశం

చాగల్లు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆదరణ-3 పథకానికి సంబంధించి సమావేశం శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదరణ-3 ప్రణాళికలు రూపొందించే క్రమంలో మండలంలోని కుల, వృత్తిదారులకు ఏ పనిముట్లు కావాలో, పంపిణీదారుల సమాచారం సేకరించడానికి సమావేశం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నిర్వహించే మండల స్థాయి సమావేశంలో వెనుకబడిన తరగతుల కుల వృత్తి సంఘ నాయకులు పాల్గొనాలని కోరారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీడీపీవో డి.మమ్మి తెలిపారు. గౌరిపల్లి ఒకటి, ఆరికిరేవుల, దారవరం రెండు చొప్పున, కుమారదేవంలో మూడు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 29వ తేదీ సాయంత్రం ఐదుగంటల లోపు తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తుదారులు నివాస, కుల, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు పదో తరగతి మార్కులలిస్టు, పుట్టిన తేదీ, అంగ వైకల్యం ఉంటే ధ్రువీకరణ పత్రం, భర్త మరణిస్తే ధ్రువీకరణ పత్రం, మైనర్ పిల్లలు కలిగి ఉంటే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు ప్రీ స్కూలు ట్రైనింగ్ పూర్తి చేసి ఉంటే ఆ సర్టిఫికెట్ కుడా దరఖాస్తుతో పాటు జతపరచాలని సూచించారు.

అర్హతలివే...

- స్థానికులైన వివాహిత మహిళలే దరఖాస్తు చేయాలి.
- వయసు జూలై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్లలోపు ఉండాలి.
- కనీసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. అదనపు విద్యార్హతలకు ప్రాధాన్యం ఉంటుంది.
- వికలాంగులైతే వైకల్యం తక్కువగా స్థాయి ఉండి తమ పనులు తాము చేసు కునే విధంగా ఉండాలి.

ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకోవాలి

నిడదవోలు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు వివిధ అంశాలపై గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ప్లాస్టిక్ నిషేధంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వివిధ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణతో పాటు సంపద కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కార్యాలయ ఏఓ జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పైపులైన్ల నిర్మాణం

నల్లజర్ల: దూబచర్ల గ్రామ పంచాయితీలో నెలరోజులుగా జలజీవన్‌మిషన్ పనులు (పైపులైను విస్తరణ)చురుగ్గా జరుగుతున్నాయి. 10వ వార్డులో ఒక వైపు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఉండగా మరోవైపు మంచినీటి పైపులైను ఉంది. దీంతో మంచినీటి పైపులైన్లు, మరికొన్ని చోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులు దెబ్బతిని రహదారి అంతా అస్తవ్యస్తంగా తయారైందని సీఐటీయూ జిల్లా నాయకులు కొక్కిరపాటి వెంకట్రావు అన్నారు. గురువారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పంచాయతీ అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణం మరమ్మతులు చేపట్టాలని కోరారు.

చట్ట పరిధిలో సమస్యల పరిష్కారం

రాజమహేంద్రవరం రూరల్: గ్రామ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని చట్ట పరిధిలో పరిష్కరించడానికి కృషి చేస్తానని జిల్లా అడిషనల్ ఎస్పీ(లాఅండ్‌ఆర్డర్) అల్లూరి వెంకట సుబ్బరాజు అన్నారు. బుధవారం రాత్రి తొర్రేడు గ్రామంలో ఆయన పల్లెనిద్ర చేశారు. ఆయన ప్రజలతో సమావేశమై, సమాజంలో జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో పక్కదారి పట్టిన వ్యక్తుల సమాచారాన్ని ప్రజల నుంచి సేకరించారు. గ్రామ పెద్దలతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై, బాల్య వివాహాలు, డయల్ 112, శక్తి యాప్, సోషల్ మీడియా, రోడ్డు భద్రతా నియమాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానికంగా జరుగుతున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాల సమాచారాన్ని తెలుసుకునేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఆయన వెంట రాజానగరం ఇన్‌స్పెక్టర్ వీరయ్యగౌడ్, ఎస్సై మనోహర్, ఇతర సిబ్బంది ఉన్నారు.